క్లుప్తంగా

దరఖాస్తు చేసుకోవాలి

వాజేడు: ప్రభుత్వ ఐటీఐలో చేరదానికి విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్స్‌పాల్ పానుగంటి శేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల 17 నుంచి మొదలైన దరఖాస్తుల స్వీకరణ జూన్ 10 వరకు ఉంటుందన్నారు. ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ విభాగాల్లో మొదటి విడుత సీట్ల భర్తీ జరుగుతున్నట్లు ఆయన తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తులను చేసుకోవాలని సూచించారు.

సన్మానం



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఎస్సైగా గుర్రం కృష్ణప్రసాద్, సెకండ్ ఎస్సైగా లాల్‌నాయక్‌లు నూతనంగా బాధ్యతలను చేపట్టారు. దీంతో తెలంగాణ మాలమహానాడు జిల్లా, మండల నాయకులు శుక్రవారం వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు జిల్లా యూత్ అధ్యక్షుడు కాళ్ల రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు మాదరి నర్సింహారావు, మండల అధ్యక్షుడు మాదరి రాంబాబు, వెంకటేశ్వర్లు, పెయ్యల రాకేష్, నారా ప్రశాంత్, మాదరి సురేష్, నవీన్, వేమునూరి చంటి పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



కన్నాయిగూడెం: మండలంలో పదో తరగతిలో మండల టాపర్‌గా నిలిచిన విద్యార్థి దబ్బగట్ల శైలజకు ఎస్సై సురేష్ శుక్రవారం రూ.5000 ఆర్థిక సాయం అందజేశారు. జిల్లాలోనే కేజీబీవీ విద్యాలయాల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థి శైలజ ఆర్థికంగా కొంత వెనకబాటు ఉండడంతో విషయం తెలుసుకున్న ఎస్సై మానవత్వం చాటుకోని చేయూతనందించారు.

గోదారి మింగింది..



వాజేడు: వివాహ వేడుకల్లో పాల్గొని సరదాగా ఈతకెళ్లిన యువకుడిని గోదారి మింగేసింది. ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పేరూరు ఎస్సై హరీశ్ తెలిపిన వివరాల ప్రకారం.. వాజేడు మండల పరిధిలోని కోయ వీరాపురం గ్రామానికి చెందిన కొర్స నవీన్ (16) తన స్నేహితులతో కలిసి టేకులగూడెంలో జరిగే వివాహ వేడుకకు హాజరయ్యాడు. వివాహం అనంతరం టేకులగూడెం శివారులో గోదావరిలో స్నానానికి వెళ్లాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగి పోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు, గ్రామస్తులు జాలర్ల సాయంతో గాలించగా మృతదేహం లభ్యమైంది. ఏటూరునాగారం సివిల్ ఆస్పత్రికి తరలించి పోస్టు మార్టమ్ అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. మృతుడి తండ్రి కొర్స నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హరీష్ తెలిపారు.

కేసు నమోదు

మహాముత్తారం: పెళ్లి బారాత్‌లో ఇద్దరు యువకులు గొడవపడిన సంఘటనలో ఒకరిపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని గండికామారం గ్రామపంచాయతీ పరిధిలోని చింతలపల్లిలో గురువారం రాత్రి ఓ పెళ్లి బారాత్ వద్ద ఇద్దరు యువకులు గొడవపడగా హరుణ్‌లాల్‌పై బూతంరాజు అనే వ్యక్తి బీర్ బాటిల్‌తో తల మీద కొట్టగా తలకు తీవ్రగాయమైంది. వీరిని అడ్డుకుని విడిపించే ప్రయత్నం చేసిన నూనావత్ నవీన్‌ని సైతం కొట్టడంతో హరుణ్‌లాల్ మహాముత్తారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దార్యప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పనుల పరిశీలన



మల్హర్: మండలంలోని కొయ్యూరు పీవీనగర్‌లో ఉపాధిహామీ పథకం ద్వారా అమృత్ సరోవర్ కార్యక్రమంలో చేపడుతున్న నీటి కుంట పనులను ఏపీఓ గిరి హరీష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరు శాతాన్ని పరిశీలించి, నిర్ణత కొలతల ప్రకారం పూడిక తీసి వేతనాలు ఎక్కువ పొందలాని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ప్రసాద్, టీఏ రమేష్ పాల్గొన్నారు.

రెగ్యులరైజేషన్‌పై వీఆర్ఏల హర్షం

ఏటూరునాగారం: వీఆర్ఏలను రెగ్యులరైజ్ చేయడంతో వారు హర్షం వ్యక్తం చేస్తూ శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం టాపాసులు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వీఆర్ఏల సంఘం జిల్లాఅధ్యక్షుడు గంపల శంకర్ మాట్లాడుతూ.. వీఆర్ఏల కష్టాలను గుర్తించి రెగ్యులరైజ్ చేస్తామన్న సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో జబ్బ నాగేశ్వర్‌రావు, బత్తుల కృష్ణ, కుమ్మరి, వెంకటయ్య, గద్దెల కృష్ణ, బందెల నర్సయ్య పాల్గొన్నారు.



ఏటూరునాగారం: సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వీఆర్ఏలు

ఎస్ఎస్ తాడ్వాయి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో వీఆర్ఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్ఏలు మాట్లాడుతూ కొంత కాలంగా తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న వీఆర్ఏల శ్రమ గుర్తించిన కేసీఆర్ రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇవ్వడం సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌బాబు, సీనియర్ అసిస్టెంట్ నాగేంద్రరెడ్డి, ఆర్ఐలు సునిల్, సాంబయ్య, వీఆర్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎస్ఎస్ తాడ్వాయిలో..



వాజేడులో..

వాజేడులో..

వాజేడు: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చిత్రపటానికి మండల వీఆర్ఏలు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. తమ ఉద్యోగాలకు భద్రత కల్పిస్తూ పే స్కేల్ చేయటాన్ని మంత్రి వర్గ సమావేశంలో ప్రకటించడం తమ జీవితాలకు పెద్ద భరోసా అని వీఆర్ఏలు కొనియాడారు. సురేష్, బాల చంద్ర మూర్తి, ఉదయ, రాంబాబు, మల్లయ్య, తదితరులున్నారు.

దుకాణాలకు లైసెన్స్ తప్పనిసరి



ఎస్ఎస్ తాడ్వాయి: మాట్లాడుతున్న ఏఓ జయసింగ్



మంగపేటలో..

ఎస్ఎస్‌తాడ్వాయి: ఎరువుల దుకాణాలకు లైసెన్స్‌లు తప్పనిసరిగా ఉండాలని ఏఓ పోరిక జయసింగ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఫర్టిలైజర్ షాపుల డీలర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వరరావు హాజరైయ్యారు. ఈ సందర్భంగా పోరిక జయసింగ్ మాట్లాడుతూ.. లైసెన్స్‌లు షాపుల వద్ద కనిపించే విధంగా ఏర్పాటు చేయాలన్నారు. స్టాక్ రిజిష్టర్, బిల్లు బుక్‌లను వ్యవసాయ అధికారులతో అటెస్టేషన్ చేయించి సర్టిఫై చేయించుకోవాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలకు బిల్లు ఇవ్వాలన్నారు. ప్రతి నెల 5వ తేదీలోపు స్టాక్ నిలువల రిపోర్టు విధిగా ఫారం–డీ రూపంలో అందించాలని సూచించారు. అనంతరం ఎస్సై వెంకటేశ్వరరావు మాట్లాడుతూ లైసెన్స్‌లు లేకుండా ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కల్తీ విత్తనాలు విక్రయిస్తే కేసులు నమోలు చేస్తామన్నారు. ఏఈఓలు రవికుమార్, నవశ్రీ పాల్గొన్నారు.

చట్టాలకు లోబడి వ్యాపారాలు నిర్వహించాలి

మంగపేట: మండలంలోని ఫర్టిలైజర్స్ షాపుల యజమానులు, విత్తనాల వ్యాపారులు, డీలర్లు చట్టాలకు లోబడి వ్యాపారాలు నిర్వహించాలని మండల వ్యసాయాధికారి చేరాలు అన్నారు. మండలంలోని రైతు వేదికలో మండలంలోని ఫర్టిలైజర్స్ షాపుల యజమానులు, విత్తనాల వ్యాపారులు, డీలర్లకు ఏఓ చేరాలు, ఎస్సై ఎస్కె తాహెర్‌బాబా ఆధ్వర్యంలో విత్తనాలు, ఎరువుల చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విత్తనాలు, ఎరువుల విక్రయాలు నిబంధనల ప్రకారం నిర్వహించాలని సూచించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే పీడీ యక్టు కేసు నమోదు చేయడం జరుగుతుందని రోజు వారిగా స్టాక్ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి మహేష్, ఫర్టీ లైజర్స్, విత్తన వ్యాపారులు, డీలర్లు పాల్గొన్నారు.

కన్నాయిగూడెంలో వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సునీల్‌కుమార్

మంగపేట: మంలడలంలోని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆధ్వర్యంలో వాగొడ్డుగూడెం పంచాయతీ పరిధిలోని కన్నాయిగూడెంలో శుక్రవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని 52 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి మందులను పంపిణీ చేశారు. 12 మంది జ్వర పీడితులను గుర్తించి వారి రక్త నమూనాలను సేకరించారు. ఇళ్ల పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని, అకాల వర్షాల కారణంగా అనారోగ్యానికి గురికాకుండా జాగ్రతలు పాటించాలని సూచించారు. ప్రధానంగా ఎండ తీవ్రత అధికాంగా ఉంటొందని, వడగాల్పులకు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని ప్రజలు ఎవరుకూడా అత్యవసరమైతే తప్ప బయటకు వెల్లొద్దని సూచించారు. అనంతరం బ్రాహ్మణపల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి రాజేందర్ ఆధ్వర్యంలో జరుగుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య పనులలో ఆయన పాల్గొని వాడకంలో లేని పాడుబడిన బావిని పూడ్చి వేయించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జయశ్రీ, ఏఎన్ఎం అరుణ, ఆశ వర్కర్లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను విస్మరించిన కేసీఆర్

మంగపేట: నిరుద్యోగులను సీఎం కేసీఆర్ విస్మరించాడని కాంగ్రెస్ పార్టీ జాతీయ మహిళా ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే సీతక్క అన్నారు. మండలంలోని కమలాపురంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్ అధ్యక్షతన నిర్వహించిన యూత్ కాంగ్రెస్ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే సీతక్క హాజరై మాట్లాడారు. హైదరాబాద్‌లో ప్రియాంక గాంధీ సంచలనాత్మక నిర్ణయం యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా తీసుకుని నిరుద్యోగ యువతీ యువకులను మేలుకొల్పే దిశగా పార్టీ శ్రేణులు, కార్యకర్తలు నడుం బిగించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ వస్తే ఉద్యోగాలు వస్తాయి బాదలు తీరుతాయని నమ్మిన యువతను కేసీఆర్ నట్టేట ముంచాడన్నారు. గడిచిన తొమ్మిదిన్నర ఏళ్ల కేసీఆర్ పాలనలో ఉద్యోగాలు రాక, ఉపాధిలేక తల్లిదండ్రులకు బారమవుతున్నామనే బాధతో నిరుద్యోగ యువతీ యువకులు ఆత్మహత్యలకు పాలపడుతున్న పరిస్థితి రాష్ట్రంలో నెలకొందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే హైదరాబాద్ డిక్లరేషన్‌ను అమలు చేస్తామన్నారు. తెలంగాణ తొలి, మలిదశ ఉద్యమాల్లో ప్రాణాలు అర్పించిన ఉద్యమ వీరులను గుర్తించి వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం, తల్లి, తండ్రి, భార్యకు నెలకు రూ.25000 అమరవీరుల గౌరవ పింఛన్ ఇస్తామన్నారు. ఉద్యమంలో నమోదైన కేసులను ఎత్తి వేయడంలో పాలు మొదటి విడతగా 2 లక్షల ఉద్యోగాల భర్తీ, మొదటి ఏడాదిలో ప్రతి ఏడాది జూన్ నాటికి అన్ని శాఖల్లోని కాళీలతో జాబ్ క్యాలండర్ ప్రకటించి నియామకాలు పూర్తి చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించే రాజీవ్ గాంధీ ఆన్‌లైన్ క్విజ్ కాంపిటీషన్ పోటీలలో పాల్గొనే యువతీ యువకులు 76618 99899 నంబర్‌కు మిస్డ్ కాల్ ఇవ్వాలన్నారు. రిజిస్ట్రేషన్ చివరి తేదీ జూన్ 01 వరకు ఉందని ములుగు నియోజకవర్గం కోడ్ 1129 కేటాయించినట్లు ఆమె తెలిపారు. జూన్ 02న క్విజ్ కాంపిటీషన్ పోటీలో పాల్గొని 40 బహుమతులు పొందాలని సీతక్క కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, కాంగ్రెస్ అనుబంధ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు గుమ్మడి సోమయ్య, ప్రచార కమిటీ అధ్యక్షుడు పూజారి సురేందర్, జిల్లా నాయకులు ఇస్సార్‌ఖాన్, కాంతారావు, వల్లెపల్లి శివయ్య, మండల నాయకులు పల్లికొండ యాదగిరి, చాద మల్లయ్య, నరేందర్, కిశోర్, వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, సమ్మయ్య, కోడం బాలకృష్ణతో పాట తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సీతక్క

పోరాటయోధుడు సుందరయ్య

వాజేడు: పుచ్చల పల్లి సుందరయ్య పోరాటయోధుడని సీపీఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు దబ్బకట్ల లక్ష్మయ్య అన్నారు. మండల కేంద్రంలో పుచ్చల పల్లి సుందరయ్య వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ.. నిరంతరం బడుగు, బలహీన వర్గాల కోసం పోరాడిన ధీరుడు సుందరయ్య అన్నారు. నిరంకుశత్వం, దోపిడీ, పీడన లేని సమ సమాజం కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప వ్యక్తి అని వర్ణించారు. అనతరం పార్టీ కార్యకర్తల కోసం ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి దబ్బకట్ల రఘుపతి, దామోదర్, కృష్ణ బాబు, రమాదేవి, ఆదినారాయణ, రామయ్య తదితరులు ఉన్నారు.



వాజేడు: సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో శుక్రవారం పుచ్చల పల్లి సుందరయ్య వర్ధంతిని సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి కృష్ణారెడ్డి హాజరై మాట్లాడారు. దేశంలో సీపీఎం పార్టీ నిర్మించడంలో సుదరయ్య ముఖ్య పాత్ర పోషించారని అన్నారు. ఆయన అశయ సాధన కోసం ప్రతి కార్యకర్త, నాయకులు కృషి చేయానిపిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తుమ్మల వెంకటరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, రత్నం రాజేందర్, లక్ష్మయ్య, నాయకులు రఘుపతి, కుమ్మరి శ్రీను, వంకా రాములు, గ్యానం వాసు, చిట్టెం ఆదినారాయణ, గుంమల్ల ప్రసాద్, కట్ల నర్సింహచారి, తదితరులు ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

వెంకటాపురం(ఎం): మండల కేంద్రంలో శివసాయి మహిళా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జెడ్పీటీసీ రుద్రమ దేవి శుక్రవారం ప్రారంభించారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుందని అన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మేడబోయిన అశోక్, ఎంపీటీసీ పోశాల అనిత విరమల్లు, ఐకేపీ ఏపీఎం, నాయకుడు బుర్ర సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

బస్సు సర్వీస్..

కన్నాయిగూడెం: భూపాలపల్లి నుంచి బస్సు సర్వీస్‌ను మండలానికి శుక్రవారం ప్రారంభించారు. ఈ సర్వీస్ మహదేవపూర్, పలిమెల, ముకునూరు, తుపాకులగూడెం నుంచి మండల కేంద్రానికి చేరుకోనుంది. ఉదయం 6.30కి, మధ్యాహ్నం 2.40, రాత్రి 9.30కి చేరుకోని నైట్ నిద్రించి మరుసటి రోజు వెళ్లనున్నట్లు అధికారులు తెలిపారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

కన్నాయిగూడెం: ప్రభుత్వాలకు, ప్రజలకు వారధిగా ఉన్న జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని వైఎస్సార్ మండల అధ్యక్షుడు కల్వచర్ల భిక్షపతి శుక్రవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు వెంటనే ఇళ్లు, ఇంటి స్థలాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం చేపట్టిన పథకాలను ప్రజల వద్దకు తీసుకుపోవడంలో వారి సేవలు మరువలేనివన్నారు.

ఎస్టీ జాబితాలో బీసీలను చేర్చొద్దు

మంగపేట: ఎస్టీ జాబితాలో బీసీ కులాలను కలపడాన్ని రద్దు పర్చాలని కోరుతూ ఆదివాసీ ఉద్యోగుల సంఘం నాయకులు ఎమ్మెల్యే సీతక్కకు శుక్రవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఫిబ్రవరి 10న అసెంబ్లీలో ఎస్టీ జాబితాల్లో 11 బీసీ కులాలను చేర్చుతూ చేసిన తీర్మానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈనెల 25న ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో తలపెట్టిన ఆదివాసీ గిరిజన ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడిలో భాగంగా ఎమ్మెల్యేకు విన్నవించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన తీర్మానం రద్దు పర్చుటకు తమకు మద్దతు తెలుపాలని సీతక్కను కోరారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. తనవంతు బాధ్యతగా ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని మీ పోరాటాలకు మద్దతు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ ద్యోగుల సంఘాల నాయకులు గొప్ప సమామరావు, మంకిడి బుచ్చయ్య, గొప్ప వీరయ్య, మద్దె నాగేశ్వర్‌రావు, కొమరం మాధవరావు, మద్దెల అంజయ్య, చింత కృష్ణమూర్తి, కోరెం శ్రీనివాస్, తోలెం కృష్ణ, జబ్బ రవి, కొండ చెంచయ్య, బోదెబోయిన నర్సింహారావు, పాదెం మల్లికార్జున్, గుండం పురుశొత్తంతో పాటు తదితరులు పాల్గొన్నారు.



సీతక్కకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మహాసభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ఏటూరునాగారం: చాకలి ఎస్సీ సాధన సమితి 6వ వార్షికోత్సవ మహాసభను విజయవంతం చేయాలని చాకలి ఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షురాలు శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రజక సంఘం అధ్యక్షుడు ముక్కెర లాలయ్య ఆధ్వర్యంలో ఈనెల 28న హైదరాబాద్‌లో జరగబోయే మమాసభ వాల్ పోస్టర్లను ఆమె ఆవిష్కరించి మాట్లాడారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరగబోయే ఈ సభలకు జిల్లాలోని రజకులంతా పెద్ద ఎత్తున తరలిరావాలన్నారు. చాకలిలను ఎస్సీలుగా కేటాయిస్తు తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్‌కు పంపించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో అధికార పార్టీ, ప్రతిపక్ష పార్టీలు మెనిఫెస్టోలో ఎస్సీ రిజర్వేషన్ అంశం చేర్చాలని డిమాండ్ చేశారు. నాయకులు ముదిగొండ వెంకటప్పయ్య, ముక్కెర లాలయ్య, పర్వతాల అన్వేష్, ముక్కెర భిక్షపతి, శ్రీరాముల సందీప్, పుణ్యం ప్రశాంత్, బన్ని, మనోజ్, ముక్కెర ముత్తమ్మ, పద్మ, సరిత, లావణ్య, సరిత, వాణి పాల్గొన్నారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీలక్ష్మి

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



శంకరాజుపల్లిలో నీటి నిల్వలను తొలగిస్తున్న పంచాయతీ కార్యదర్శి నాగరాజు



శివాపురంలో చెత్తాచెదారం తొలగిస్తున్న సిబ్బంది

ఏటూరునాగారం: మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. ఆయా గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు ఉదయం 7 గంటల నుంచి పనులు నిర్వహించేదుకు ఫీల్డ్ విజిట్ చేస్తున్నారు. శుక్రవారం డ్రై డేగా పాటించి క్లోరినేషన్, నీటి నిల్వలు తొలగింపు, బురదల్లో ఆయిల్ బాల్స్ విసరడం, దోమల మందు పిచికారీ, రోడ్ల వెంట బ్లీచింగ్, ప్రభుత్వ భవనాలు శుభ్రం చేయడం, పిచ్చి మొక్కల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు.



రామన్నగూడెంలో ప్రభుత్వ పాఠశాలను శుభ్రం చేస్తున్న సిబ్బంది

పచ్చిరొట్టతో భూసారం పెంపు

మల్హర్: పచ్చి రొట్ట సాగు భూసారం పెంపునకు కృషి చేస్తుందని మండల వ్యవసాయ శాఖ అధికారి ముంజ మహేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరి, మిర్చి పంట వేసే రైతులు తప్పనిసరిగా పచ్చి రొట్ట విత్తనాలు తొలకరి దుక్కి దున్ని చల్లుకోవాలని తెలిపారు. 45 రోజుల తర్వాత పూత దశలో కలియదున్నుతే భూమి సారవతం కావడంతో పాటు పంట దిగుబడులు పెరుగుతాయని వివరించారు. అలాగే 2023 వర్షకాలం సీజన్ నాటికి రాయితీపై 330 క్వింటాంళ్ల జీలుగు విత్తనాలు మండలంలోని తాడిచర్ల సహకార సంఘం, కొయ్యూరు ఆగ్రోస్ సేవా కేంద్రంలో అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. విత్తనాలు కావల్సిన రైతులు పట్టా పాస్‌బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్‌లతో మండలంలోని వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

పరామర్శ

టేకుమట్ల: మండలంలోని రామమకిష్టాపూర్(వి) గ్రామానికి చెందిన సాగర్ల రాజయ్య గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటంబాన్ని ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి శుక్రవారం పరామర్శించారు. రాజయ్య మృతదేహం వద్ద నివాళులర్పించారు. సర్పంచ్ అడగాని రామారావు, వెల్లంపల్లి ఎంపీటీసీ సంగి రవి, ఎంపేడు సర్పంచ్ కొలిపాక రాజయ్య, ఐలయ్య ఉన్నారు.

22 నుంచి క్రీడాకారుల ఎంపికలు

ఏటూరునాగారం: ఈనెల 22 నుంచి 24 వరకు మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ క్రీడా మైదానంలో సీఎం కప్ 2023 హ్యాండ్‌బాల్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికలను చేపడుతున్నట్లు జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకటరమణచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలకు ఇన్‌చార్జ్‌గా కోచ్ పర్వతాల కుమారస్వామిని నియమించామన్నారు. జిల్లా స్థాయి హ్యాండ్ బాల్ ఎంపికలో పాల్గొనేవారు పురుషులు, మహిళలు 15 సంవత్సరాల నుంచి 36 సంవత్సరాల వరకు ఉన్న క్రీడాకారులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. వారి ఆధార్ కార్డ్ ను పోటీల్లో పాల్గొనే రోజున తీసుకొని రాగలరని తెలిపారు. ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు హైదరాబాదులో ఎల్బీ స్టేడియంలో జరగబోయే రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ కు పంపడం జరుగుతుందని వెంకటరమణచారి తెలిపారు. పూర్తి సమాచారం కోసం 96664 85815ను సంప్రదించాలన్నారు.